సాక్షి కుమురం భీం

శుక్రవారం : 5 : జనవరి : 2024



నాగోబా జాతరకు సన్నద్ధం

కేస్లాపూర్‌లో ఫిబ్రవరి 9న నాగోబా జాతర ప్రారంభం కానుంది. కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. 8లో▸



చలిగుప్పిట 'కెరమెరి'

చుట్టూ అడవులు విస్తరించి ఉండటంతో కెరమెరి మండలంలో చలి తీవ్రత అధికంగా ఉంది. ఉదయం 8గంటలు దాటినా పొగమంచు వీడడం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం 28.5 /16.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వాళ్లు కంప్యూటర్ ఆపరేటర్లే!

- సీసీలుగా ఎవరినీ నియమించలేదు
- కలెక్టర్ హేమంత్ బోర్కడే

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఇప్పటివరకు ఎవరినీ సీసీలుగా నియమించలేదని కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలపై గురువారం ఆయన స్పందించారు. తన పేషీలో పని చేస్తున్న హ్యాండ్ హోల్డింగ్ పర్సన్ రాజశేఖర్‌ను కేవలం కంప్యూటర్ విధులకు మాత్రమే వినియోగిస్తున్నామన్నారు. ఇక అదనపు కలెక్టర్లు, డీఆర్వో పేషీల్లోనూ కంప్యూటర్ పనులకు ముగ్గురు ఆపరేటర్ల సేవలు వినియోగిస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధన మేరకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంల తరలింపు కోసం ఎన్నికల్లో పని చేసిన సిబ్బందికి టీఏ, డీఏల నిమిత్తం ఖర్చు పెట్టామని తెలిపారు.

9 నుంచి సదరం క్యాంపులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి దివ్యాంగులకు సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 9న మూగ, చెవిటి, 18న కంటి చూపు, 23న మానసిక వైకల్యం, 30న ఎముకలకు సంబంధించిన వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రంలో పరీక్షలు చేయించుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. క్యాంపులకు వికలత్వ ఆరోగ్య పరీక్ష పత్రాలతో హాజరు కావాలన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ నమోదు కేంద్రం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామంలోని ఆధార్ నమోదు కేంద్రాన్ని గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి జన్‌మన్ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డులో వివరాలు అప్‌డేట్ లేని వారు వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ సెంటర్‌లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు.

లక్ష దాటిన 'ప్రజాపాలన' దరఖాస్తులు

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఆరో రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 22,321 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల సంఖ్య 1,22,193కు చేరింది.

లీవ్‌లో ఉన్న డీఈవో విధుల్లో చేరాలి

ఆసిఫాబాద్‌రూరల్: కొన్నిరోజులుగా లీవ్‌లో ఉన్న డీఈవో తిరిగి విధుల్లో చేరాలని డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు పురుషోత్తం అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల నుంచి డీఈవో లీవ్‌లో ఉండటంతో విద్యవ్యవస్థపై పర్యవేక్షణ గాడి తప్పుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయన విధుల్లో చేరాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, శ్రీకాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆశ్రమ' విద్యార్థినికి బంగారు పతకం



అనితను అభినందిస్తున్న అధికారులు

జైనూర్(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మడావి అనితకు రాష్ట్రస్థాయిలో బంగారు పతకం రావడం అభినందనీయమని ఏటీడీవో పురుషోత్తం, ప్రధానోపాధ్యాయుడు సోనేరావు అన్నారు. గురువారం విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన షాట్‌పుట్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిందని వారు పేర్కొన్నారు.

జీపీలపై భారం

- తిర్యాణి మండలం చింతపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 359 కుటుంబాలు, 1476 జనాభా ఉంది. ఇక్కడ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయక ముందు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు విద్యుత్ బిల్లు వచ్చేది. కానీ ఆ జీపీలో 12 హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశాక.. ప్రస్తుతం నెలకు రూ.30 వేలకు పైగా విద్యుత్ బిల్లు వస్తోంది.
- ఇదే మండలంలోని నాయకపుగూడ గ్రామ పంచాయతీ పరిధిలో 256 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ జీపీలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయక ముందు రూ.5 వేలలోపు విద్యుత్ బిల్లు వచ్చేది. ప్రస్తుతం కొత్తగా నాలుగు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నెలకు రూ.10 వేలకు పైగా బిల్లు వస్తోంది.

- 152 గ్రామ పంచాయతీల్లో 383 చోట్ల హైమాస్ట్ లైట్లు ఏర్పాటు
- పంచాయతీలకు రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు
- నిర్వహణ గుదిబండగా మారుతున్న వైనం
- సోలార్ లైట్లు మేలంటున్న సర్పంచులు



తిర్యాణి మండలం చింతపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్

సాక్షి, ఆసిఫాబాద్: హైమాస్ట్ ఎల్‌ఈడీ లైట్ల నిర్వహణ గ్రామ పంచాయతీ(జీపీ)లకు భారంగా మారింది. ఎల్‌ఈడీ లైట్లతో గ్రామాల్లో ప్రధాన కూడళ్లు దగదగలాడుతున్నా వాటి వినియోగానికి అయ్యే విద్యుత్ బిల్లులు మాత్రం దడ పుట్టిస్తున్నాయి. మేజర్ పంచాయతీలకు వీటి భారం మోసే శక్తి ఉంటే.. చిన్న పంచాయతీలకు మాత్రం ఇది గుదిబండగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారుల్లో ఏర్పాటు చేసినట్లుగా సోలార్ పద్ధతిన ఈ వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మొత్తం 10 మండలాలు ఉన్నాయి. ఇందులో 8 మండలాల్లోని 152 గ్రామ పంచాయతీల్లో 383 చోట్ల హైమాస్ట్ ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేసేందుకు రూ.7,58,50,000 డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేశారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో 290 చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. అందులో ఆసిఫాబాద్ మండలంలోని 23 జీపీల్లో 66 చోట్ల, జైనూర్ మండలంలోని 19 జీపీల్లో 44 చోట్ల, కెరమెరి మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో 31 చోట్ల, లింగాపూర్ మండలంలో 11 గ్రామ పంచాయతీల్లో 13 చోట్ల, రెబ్బెన మండలంలో 22 జీపీల్లో 28, సిర్పూర్(యూ) మండలంలో 12 జీపీల్లో 14, తిర్యాణి మండలంలో 17 జీపీల్లో 66 చోట్ల, వాంకిడి మండలంలో 24 జీపీల్లో 94 చోట్ల ఈ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నామినేషన్ పద్ధతిన రూ.7.58 కోట్ల విలువైన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం గమనార్హం.

ఏర్పాటులోనూ చేతివాటం..

ఈ వీధి దీపాల పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాసిరకం పరికరాలతో పోల్స్ ఏర్పాటు చేసి రూ.కోట్ల నిధులకు ఎసరు పెట్టారు. మొత్తం 152 గ్రామ పంచాయతీల్లో 290 చోట్ల ఈ హైమాస్ట్ ఎల్‌ఈడీ లైట్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.6.40 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు రూపొందించారు. ఒక్కో పోల్ ఏర్పాటుకు రూ.2 లక్షలు అంచనా ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ మాత్రం రూ.20 వేలలోపు ఖర్చుతో లైట్లను ఏర్పాటు చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. అయితే ఎంపీడీవోలు మాత్రం ఒక్కొక్క దానికి రూ.1.60 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకు బిల్లులను ఆమోదించినట్లు తెలుస్తోంది. మొత్తంగా రూ.4.64 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

బిల్లుల భారం..

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని 8 మండలాల్లోని 152 జీపీల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుకు ముందు ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.5 వేల నుంచి రూ.10 వరకు విద్యుత్ బిల్లులు వచ్చేవి. ఆ బిల్లులు కట్టేందుకే అపసోపాలు పడాల్సిన దుస్థితి. ప్రస్తుతం నెలనెలా ఎంపీడీవో కార్యాలయం నుంచి రూ.12 వేల వరకు బిల్లు, రెండు నెలలకోసారి సెంట్రల్ ఫండ్ నుంచి జీపీ జనాభాను బట్టి రూ.1.50 లక్షల వరకు నిధులు వస్తున్నాయి. ఇందులో నుంచి కరెంటు బిల్లులు, పంచాయతీతో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఇతర కాంట్రాక్టు ఉద్యోగులకు చెల్లిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లతో కరెంటు బిల్లు మూడు రెట్లు పెరగడంతో పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. విద్యుత్ బిల్లు భారం అంశంపై జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్ వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

సోలార్... సో బెటర్



ఆసిఫాబాద్‌లోని జాతీయ రహదారిపై సోలార్/విద్యుత్ విధానంలో ఏర్పాటు చేసిన లైట్లు

ప్రస్తుతం జాతీయ రహదారుల్లోని హైమాస్ట్ లైట్లను సోలార్/విద్యుత్ పద్ధతిలో ఏర్పాటు చేస్తున్నారు. మన జిల్లాలోనూ చాలా ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. సోలార్ పద్ధతిన నడిస్తే కరెంటు బిల్లుల భారం ఉండదు. ఒకవేళ ఏదైనా అనుకోని పరిస్థితుల్లో 15 రోజుల పాటు సూర్యరశ్మి లేకపోతే అప్పుడు విద్యుత్ ద్వారా వీటిని నిర్వహిస్తారు. అలాంటి సమయంలో కూడా విద్యుత్ బిల్లు పెద్దగా ఉండదని ఎన్‌హెచ్ రహదారి నిర్వాహకులు చెబుతున్నారు. ఇదే పద్ధతిన జీపీల్లోనూ హైమాస్ట్ ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసి ఉంటే.. బిల్లుల భారం పడేది కాదని సర్పంచులు అంటున్నారు.

'జన్‌మన్'తో గిరిజనుల అభివృద్ధి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్ పథకం ద్వారా పీటీజీ గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి తహసీల్దార్లు, వైద్యారోగ్యశాఖ, బ్యాంకింగ్, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులతో ప్రధానమంత్రి జన్‌మన్ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం విజయవంతం చేయడానికి సంబంధిత 10 శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి పీటీజీ గిరిజన కుటుంబంలో అందరికీ ఆధార్‌కార్డులు, పక్కా ఇళ్లు, ప్రతి ఇంటికీ నల్లాలు, విద్యుత్ కనెక్షన్లు కల్పించాలని ఆదేశించారు. దీంతో పాటు ఆదివాసీ గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం, విద్య శిక్షణకు వసతి గృహాలతోపాటు సుదూర మారుమూల ప్రాంతాలకు సంచార వైద్య సదుపాయం, పోషకాహారం, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులకు ఉన్నత జీవన సౌకర్యం, ప్రతి గ్రామానికి ఫోన్ సౌకర్యం కల్పించాలన్నారు. మల్టీపర్పస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, భారత గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం నిర్వహణకు సంబంధిత అధికారులు సమష్టి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

- అదనపు కలెక్టర్ దాసరి వేణు
- 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ



గోలేటిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో అర్హులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. రెబ్బెన, గోలేటి, కొమురవెల్లి, రాజారాం పంచాయతీల్లో గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెబ్బెన, గోలేటిలో నిర్వహించిన గ్రామసభలకు అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ నెల 6లోగా అర్హులు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తి కాగానే ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతామని తెలిపారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, చేయూత పథకాల కోసం పంచాయతీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తులు అందించాలని అన్నారు.

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం

గ్రామాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను గురువారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు పరిశీలించారు. గోలేటి, కొమురవెల్లిలలో నిర్వహించిన గ్రామసభలకు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి ఉదయ్‌బాబు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర(సర్‌సిల్క్) పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ ఆధ్వర్యంలో గురువారం సుస్థిర జీవన విధానం అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఈవో మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. కాలుష్య కారకాలను వినియోగించొద్దని సూచించారు. ప్రజల జీవన శైలిలో మార్పులు వచ్చినప్పుడు మాత్రమే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ హరితదళ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్‌రావు, రిసోర్స్‌పర్సన్ శివకుమార్, యనమల వెంకటేశ్వర్లు, మండల నోడల్ అధికారి దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు 'గిరి' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అనిత

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఫుట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. ఈ మేరకు విద్యార్థినులను పాఠశాల ఆవరణలో గురువారం పీడీలు రవికుమార్, చిన్నక్క, లక్ష్మితో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిసెంబర్ 17 నుంచి 19 వరకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆర్తి, కౌసల్య ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి 21 వరకు జార్ఖండ్‌లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని వెల్లడించారు.

విద్యార్థినికి అభినందన



శ్రీదేవితో ప్రిన్సిపాల్ శారద

బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్న మహిళా గిరిజన డిగ్రీ గురుకుల కళాశాల విద్యార్థిని శ్రీదేవిని గురువారం ప్రిన్సిపాల్ శారద, పీడీ హారిక అభినందించారు. డిసెంబర్ 28న చండీఘడ్‌లో జరిగిన సౌత్ జోనల్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

'ప్రజాపాలన'లో అనాథ పిల్లల దరఖాస్తు

- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకోలు



దరఖాస్తు చేస్తున్న అనాథలు

సిర్పూర్(టి): ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ప్రజాపాలన కార్యక్రమంలో అనాథ పిల్లలు దరఖాస్తు చేసుకున్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ యూసుఫ్, ఆసియా బేగం దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరి తల్లి ఆసియాబేగం ఏడేళ్ల క్రితం పాముకాటుతో మృతి చెందగా.. రెండేళ్ల క్రితం తండ్రి యూసుఫ్ అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. పెద్ద కుమార్తె మహీన్ నిదా ఇంటర్ ఫస్టియర్ చదువుతుండగా.. రెండో కుమార్తె నూరి బేగం తొమ్మిదో తరగతి చదువుతోంది. కుమారుడు ముస్తఫా మదర్సాలో చదువుతున్నాడు. మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఈవో కృష్ణమూర్తికి వారు అభయహస్తం దరఖాస్తు అందజేశారు. అనాథలైన తమకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్నారు.

'పెట్టుబడి' తిప్పలు!



జిల్లా కేంద్రానికి చెందిన మార సుగుణాకర్‌కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. యాసంగిలో ఆరుతడి పంటలతోపాటు కూరగాయలు సాగు చేస్తున్నాడు. పెట్టుబడి సాయం అందకపోవడంతో విత్తనాలు, యూరియా, కూలీల ఖర్చుకు ఇబ్బంది పడుతున్నాడు.



ఈ ఫొటోలోని రైతు పేరు కొలిపాక సత్యనారాయణ. దహెగాం మండలం చౌక గ్రామానికి చెందిన ఈయన యాసంగిలో మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రైతుబంధు నగదు జమ చేస్తే ఉపశమనంగా ఉంటుందని ఆయన పేర్కొంటున్నాడు.



రెబ్బెన మండలంలో నారుమడి

- యాసంగి సీజన్‌కు సంబంధించి 'రైతుబంధు' విడుదలలో జాప్యం
- జిల్లాలో ఇప్పటివరకు 24,210 మంది రైతుల ఖాతాల్లోనే జమ
- 94,793 మందికి తప్పని ఎదురుచూపులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా యాసంగి సాగు ఊపందుకుంది. మొత్తం 30 వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. అందులో వరి పంట దాదాపు 18,000 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే దహెగాం, కౌటాల, పెంచికల్‌పేట్, బెజ్జూర్, రెబ్బెన వంటి మండలాల్లో వరి నాట్లు ఇప్పుడిప్పుడే జోరందుకున్నాయి. ఈ తరుణంలో యాసంగి సీజన్‌కు సంబంధించి చాలా మంది రైతులకు పెట్టుబడి సాయం ఇప్పటివరకు అందలేదు. ఎరువులు, విత్తనాలు, ట్రాక్టర్, కూలీల ఖర్చు, ఇతర అవసరాలకు చేతిలో నగదు లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం భూ విస్తీర్ణం ఆధారంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తుందని అధికారులు చెబుతున్నారు.

24,210 మందికే రైతుబంధు..

జిల్లాలో మొత్తం 1,31,588 మంది రైతులు ఉండగా వీరికి రూ.221.80 కోట్లు అందజేయాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 24,210 మందికి పెట్టుబడి సాయం ఖాతాల్లో జమ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే రైతుల ఖాతాల్లో రైతుబంధు నగదు జమ చేయాల్సి ఉంది. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విడతల వారీగా పాత పద్ధతిలో రైతుబంధు అందిస్తామని ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు గత నెల 10 నుంచి ఎకరానికి రూ.5వేల చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు.

విడతల వారీగా పంపిణీ..

రాష్ట్ర ప్రభుత్వం ఎకరం లోపు రైతులకు మొదట పెట్టుబడి సాయం అందించగా.. విడతల వారీగా మిగిలిన వారికి పంపిణీ చేస్తామని ప్రకటించింది. జిల్లాలో రెండెకరాల్లోపు భూమి ఉన్న అన్నదాతలు 69,442 మంది ఉన్నారు. 2.5 నుంచి ఐదెకరాల్లోపు వారు 48,210 మంది, 5 నుంచి 25 ఎకరాలలోపు వారు 20,788 మంది, 25 ఎకరాలపై భూమి ఉన్న వారు కేవలం 148 మంది మాత్రమే ఉన్నారు. జిల్లాలో చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు జిల్లాలో రెండెకరాల లోపు వారికి మాత్రమే పెట్టుబడి సాయం అందినట్లు తెలుస్తోంది. మరో వైపు రైతుబంధుకు పరిమితి విధిస్తారనే వదంతులు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. షరతులు లేకుండా అర్హులందరికీ పెట్టుబడి సాయం అందించాలని కోరుతున్నారు.

'రైతుబంధు' వివరాలు

రైతులు	1,31,588
పంపిణీ చేయాల్సిన నగదు	రూ.221.80 కోట్లు
పెట్టుబడి సాయం అందిన వారు	24,210
పంపిణీ చేసిన నగదు	రూ.7,72,27,120
సాయం అందాల్సిన వారు	94,793
బ్యాంకు వివరాలు ఇవ్వాల్సిన వారు	6,753

షరతులు విధిస్తే నష్టం



నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా పెట్టుబడి సాయం అందించాలి. ఇప్పటికే యాసంగి సాగు పనులు ప్రారంభించాం. నాకు 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయమే జీవనాధారం. షరతులు విధిస్తే నష్టం కలుగుతుంది. ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉండాలి.

– చంద్రు విఠు, గొడవెల్లి, మం.ఆసిఫాబాద్

ఎలాంటి పరిమితి లేదు

యాసంగి సీజన్‌కు సంబంధించి పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. ప్రభుత్వం ప్రత్యేకంగా ఎలాంటి పరిమితి విధించలేదు. భూమి విస్తీర్ణం బట్టి విడతల వారీగా నగదు జమ చేస్తుంది. రైతు బంధుకు సంబంధించి రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి: గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం ఇంద్రానగర్‌కు చెందిన గద్దల వెంకటేశ్ (36) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిస కావడంతో అనారోగ్యానికి గురయ్యాడు. అతని భార్య లక్ష్మి ఇటీవల క్రిస్మస్ వేడుకలకు కన్నెపల్లి మండలం మెట్‌పల్లిలో ఉన్న పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితమే అనారోగ్యంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి గురువారం డిశ్చార్జి కావడంతో ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రైలు పట్టాల వద్దకు వెళ్లి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నాగయ్య మృతదేహం

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్‌రోడ్డు సమీపంలో జనవరి 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంచిర్యాలకు చెందిన గంట నాగయ్య (55) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మంచిర్యాలలోని రెడ్డి కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నాగయ్య ఈ నెల 1న షెట్‌పల్లికి వచ్చి మంచిర్యాలకు వెళ్తుండగా ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసేక్రమంలో ట్రాక్టర్ బోల్తా కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'కార్మికులకు సర్వీస్ ప్రమోషన్లు ఇవ్వాలి'

శ్రీరాంపూర్: కార్మికులకు సర్వీస్ లింక్ ప్రమోషన్స్(ఎస్ఎల్పీ) వెంటనే ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి ఉపాధ్యక్షులు కొట్టె కిషన్‌రావు, కొమురయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకే కేటగిరీలో భూగర్భంలో ఏడేళ్లు, సర్ఫేస్‌లో ఎనిమిదేళ్లు పనిచేస్తే వారికి జనవరి 1న ఎస్ఎల్పీ ప్రమోషన్లు అందజేయాల్సి ఉందన్నారు. గతేడాది జనవరి1న అప్పటి గుర్తింపు సంఘం నాయకులతో హంగామా చేయించి కార్మికులకు లెటర్లు ఇచ్చిన యాజమాన్యం ఇప్పుడు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అధికారులు స్పందించి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గంజాయి స్వాధీనం


గంజాయి, నిందితుడితో పోలీసులు

మంచిర్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఒక యువకుని వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పత్తం అభిరామ్ మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి రైలుమార్గం ద్వారా గంజాయి తీసుకువస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు గురువారం రైల్వే స్టేషన్‌లో సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 68 గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మరో 12 రోజులు ముల్కల్లలోనే..

- లెక్కింపు కేంద్రంలోని స్ట్రాంగ్ రూముల్లో ఎన్నికల సామగ్రి
- ఐదేళ్ల వరకు ఈవీఎంలు భద్రంగా ఉంచాల్సిందే..
- 45 రోజుల అనంతరం ఐడీఓసీలోని గోదాములోకి..



హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాల లెక్కింపు కేంద్రంలోని స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసినా హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలోని లెక్కింపు కేంద్రంలో ఎన్నికల సామగ్రి ఇంకా భద్రంగా ఉన్నాయి. ఓట్ల లెక్కింపు ముగిసిన వెంటనే ఈవీఎంలతో పాటు వీవీ ప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీ ప్యాట్లలోని స్లిప్పులు, మాక్ పోల్ ధ్రువ ప్రతాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి తాళాలు వేసి సీజ్ చేశారు. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రి అంతా బందోబస్తులో భద్రపరచి ఉంచారు. లెక్కింపు కేంద్రంలో 45 రోజుల పాటు ఎన్నికల సామగ్రి భద్రపర్చాల్సి ఉండగా మరో 12 రోజులు (ఈ నెల 17 వరకు) ముల్కల్లలోనే ఉంచనున్నారు. ఆ తర్వాత మంచిర్యాల జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్ట్రాంగ్‌రూం గోదాములోకి వీటిని మారుస్తారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట నిఘా..

హాజీపూర్ మండల ముల్కల్లలోని ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రంలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం, తదితర ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. భద్రతా సిబ్బంది విడతల వారీగా 24 గంటల పాటు నిఘా కళ్లతో పర్యవేక్షిస్తున్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్లతో పాటు ఎన్నికల సామగ్రిని ఎన్నికల సంఘానికి అప్పగించే వరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫిర్యాదుతో తక్షణ పరిష్కారం దిశగా..

ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత గెలిచిన అభ్యర్థిపై ఓడిపోయిన అభ్యర్థి ఫిర్యాదు చేసే అవకాశాలు కూడా ఉంటాయి. ఓట్ల లెక్కింపు సమయంలో అవకతవకలు జరిగాయని సదరు అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థులకు న్యాయం చేయడానికి ఈవీఎం కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమై ఉన్న ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానం ఆదేశించవచ్చు. ఈ క్రమంలోనే ఏ నియోజకవర్గం నుంచి అయినా ఫిర్యాదు వస్తే దానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్‌లో ఓట్లను తక్షణమే లెక్కించడానికిగానూ ముందస్తుగా అధికారులు ఈ ఈవీఎంలను భద్రపరుస్తారు. అయితే మంచిర్యాల జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వడంతో ఫలితాలపై కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తవని పరిశీలకులు స్పష్టంగా పేర్కొంటున్నారు. అయినా భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు లెక్కింపు కేంద్రంలో భద్రపరిచి ఉంచారు.

45 రోజుల తర్వాత..

ఎన్నికల ఫలితాలు వెల్లడించిన 45 రోజుల పాటు జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత కల్పిస్తారు. అనంతరమే ఎన్నికల సామగ్రిని ఎన్నికల సంఘానికి అప్పగించి గోదాములకు చేర్చి అక్కడ వాటిని ఐదేళ్ల పాటు భద్రపరుస్తారు. ఆపై ఎన్నికల సంఘంచే నియమించబడిన సాంకేతిక సిబ్బంది వచ్చి ఈవీఎం, వీవీ ప్యాట్లలో ఉన్న డేటాను మొత్తం తొలగిస్తారు. ఆపై దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈ ఎన్నికల సామగ్రిని తరలించి అక్కడ జరిగే ఎన్నికలకు వినియోగిస్తారు.

జాతీయస్థాయి పోటీలకు రెఫరీలుగా ఎంపిక


కే.మల్లేశ్


ఆర్.రామకృష్ణ


ఆర్.శ్రీనివాస్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఈ నెల 6 నుంచి 10 వరకు జరగనున్న 69వ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రెఫరీలుగా గోలేటికి చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ తెలిపారు. కుమ్మరి మల్లేశ్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.రామకృష్ణ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ నాయకులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ఏరియా ఆస్పత్రిలో బదిలీలు ఆపాలి

- ఎమ్మెల్యే గడ్డం వినోద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో కార్మికుల బదిలీలు ఆపాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. గురువారం ఐఎన్టీయూసీ నాయకులు, ఆస్పత్రి కార్మికులు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వార్డుల కుదింపు, స్పెషలిస్టు వైద్యుల నియామకాలు లేకపోవడం, రోగుల ఇబ్బందులు వివరించారు. ఆస్పత్రి మూసివేతకు యాజమాన్యం యత్నిస్తోందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సింగరేణి సీఅండ్ ఎండీ బలరాం నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బెల్లంపల్లిలో పదివేల మంది కార్మిక కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, కార్మికులకు వైద్య సేవలు అందించాల్సింది పోయి ఆస్పత్రిని నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు సిద్దంశెట్టి రాజమొగిలి, సోకాల శ్రీనివాస్, కుక్కల ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణీయులకు అందుబాటులో సీఎండీ


సీఎండీ బలరాంతో కార్మికుడు సురేష్


బలరాంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణి సీఎండీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ పా) ఎన్.బలరాం సింగరేణీయులకు అందుబాటులో ఉంటున్నారని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మందమర్రి ఏరియాలోని కేకే–5గనిలో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికుడు మంగళంపల్లి సురేష్ గురువారం హైదరాబాద్‌లో కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతంలో సీఎండీగా బాధ్యతలు నిర్వహించిన శ్రీధర్‌ను అధికారులు కలవాలంటేనే ఎంతో శ్రమపడాల్సి వచ్చేదని, సాధారణ కార్మికుడు కూడా ప్రస్తుత సీఎండీని కలిసే అవకాశం కల్పించడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు తొమ్మిదేళ్లుగా సీఎండీగా ఎన్.శ్రీధర్ విధులు నిర్వహించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను తొలగించి జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలని సూచించింది. సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ పా) బాధ్యతలు నిర్వర్తిస్తున్న బలరాంకు సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏది ఏమైనా సింగరేణి సంస్థపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని, గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని వెలికితీసి సంస్థకు రావాల్సిన బకాయిలు వసూలు చేయాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు.

సీఎండీని కలిసిన ఎస్సీ, ఎస్టీ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరాంను సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో అసోసియేషన్ సెంట్రల్ ఉపాధ్యక్షుడు వంగూరు కెనడి, ఏరియా ఉపాధ్యక్షుడు నిలబోయిన కుమార్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాజేంద్రప్రసాద్, చెన్నూరి శ్రీనివాస్, చెరుపల్లి సురేష్, చిన్ని ప్రశాంత్, అశోక్ పాల్గొన్నారు.

'కార్మికులకు అండగా ఉంటాం'


మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: గుర్తింపు ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా కార్మికులకు అండగా ఉంటామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. గురువారం ఆర్కే 7గనిపై కార్మికులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. శ్రీరాంపూర్‌లో తాము ఓడిపోయినా మిగిలిన ఆరు ఏరియాల్లో గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కార్మికులకు ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉండి పోరాడుతామన్నారు. సింగరేణి నిధులను సింగరేణి ప్రాంతంలోనే ఖర్చు చేయాలని కోరారు. సింగరేణి ప్రాంతంలో అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, తమ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి ముఖ్యమంత్రిని కోరుతామన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, నాయకులు గరిగే స్వామి, శ్రీనివాస్, శ్రీకాంత్, జే.నర్సింగ్, భీం రవి, సదానందం, వెంకటేశ్, రాకేశ్‌రెడ్డి, జీవన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సాహస కృత్యానికి దక్కిన గౌరవం

- 'భీష్మ వశిష్ట' అవార్డుకు ఎంపికైన కార్తీక్


తల్లిదండ్రులతో కార్తీక్

కెరమెరి(ఆసిఫాబాద్): సాహసకృత్యాల్లో ఎన్నో పతకాలు సాధించి జిల్లాకే పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన మండలంలోని కెలికే గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్ 'భీష్మ వశిష్ట పురస్కార్' అవార్డుకు ఎంపికయ్యాడు. వందేభారత్ ఆర్గనైజేషన్ కమిటీ ఆర్గనైజర్ వరప్రసాద్ ద్వారా ఆహ్వానం అందింది. ఈ నెల 6న వైజాగ్‌లోని చెన్నాస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. కెరమెరి మండలం కెలికే గ్రామానికి చెందిన గిత్తే రుక్మాజి, ఇటాబాయి దంపతుల కుమారుడు కార్తీక్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలోని మైనార్టీ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. 2023 అక్టోబర్‌లో సిక్కిం రాష్ట్రంలోని చంచోయ్ భీకర అడవుల్లో 15 కిలోల బ్యాగుతో పీఈటీ, రన్నింగ్, ట్రెక్కింగ్‌లో శిక్షణ తీసుకున్నాడు. అదే అడవుల్లో 10 డౌన్ హిల్ అనే ప్రాంతంలో 9,600 అడుగుల ఎత్తులో 20 కిలో మీటర్ల దూరం వరకు ట్రాయల్ టెక్ చేశాడు. 11 వేల అడుగుల ఎత్తులో ఉన్న అక్లిమటైజేషన్‌లో ట్రెక్ చేశాడు. 14 వేల అడుగుల ఎత్తు 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇంథామ్‌వెల్లి నుంచి ట్రాంజెష్ట క్యాంప్–1లో ట్రెక్కింగ్ చేశాడు. 5,300 అడుగుల ఎత్తులో ఉన్న మంచుకొండలను అధిరోహించి తిరంగా జెండాను ఎగురవేశాడు. ఈ సందర్భంగా వందేభారత్ ఆర్గనైజేషన్ వారు కార్తీక్‌ను అవార్డుకు ఎంపిక చేశారు.

నాగోబా జాతరకు సన్నద్ధం

- ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు జాతర
- 12న నాగోబా దర్బార్
- ఏర్పాట్లపై కలెక్టర్, ఐటీడీఏ పీవో సమీక్ష
- భక్తులకు ఏ లోటు రాకుండా ఏర్పాట్లు చేయాలని సూచన
- జాతరకు మంత్రులు వచ్చే అవకాశం ఉందన్న రాహుల్‌రాజ్


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్, పీవో


నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదివాసీల ఆరాధ్యదైవం, పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఫిబ్రవరి 9న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతంలో మెస్రం వంశీయులు బస చేసే గోవడ్ స్థలం, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

30లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ నాగోబా దర్బార్ హాల్‌లో ఆయా శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. గతేడాది శాఖల వారీగా చేసిన ఏర్పాట్ల వివరాలు పరిశీలించారు. ఈ ఏడాది చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రణాళిక తయారుచేసి నివేదిక అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు జాతర కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా 12న నాగోబా దర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు వివిధ శాఖల మంత్రులు రానున్నట్లు తెలిపారు. శాశ్వత మరుగుదొడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు గోవడ్ వద్ద, మర్రిచెట్టు, పోలీస్ క్యాంపు, జాతర నిర్వహణ స్థలాల్లో తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయించాలన్నారు. ముత్నూర్ నుండి కేస్లాపూర్ వరకు, మెండపల్లి నుండి నాగోబా ఆలయం వరకు, హర్కపూర్ చౌక్ నుండి కేస్లాపూర్ వరకు రోడ్లకు మరమ్మతు చేయాలన్నారు. ఈ పనులన్నీ ఈనెల 30 లోగా పూర్తి చేయాలన్నారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉన్నందువల్ల ఈసారి జాతరకు మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అప్పగించిన బాధ్యతలను గడువులోగా పూర్తి చేసి జాతర విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ఆదివాసీ నాయకుడు ఆర్క ఖమ్ము మాట్లాడుతూ గత జాతరలో దొంగతనాలు, మట్కా జూదం వంటి సంఘటనలు జరిగాయని, ఈసారి అలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్, పీవోను కోరారు. జాతరలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్న ప్లాట్ల ధర ఏటా పెంచుతుండడంతో వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారన్నారు. దీనిపై కూడా ఆలోచించాలన్నారు. జాతరలో వచ్చే ఆదాయం, ఖర్చులను సామాన్య ప్రజలకు తెలిసేలా సూచిక బోర్డులో నమోదు చేయాలని కోరారు. స్పందించిన అధికారులు ఈసారి పోలీసు బందోబస్తు పెంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ రామకృష్ణ, ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశ ఉద్యోగులు మనోహర్, సోనేరావ్, శేఖర్‌బాబు, దేవ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఎండీ బలరాం

జైపూర్: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ 2024ను గురువారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్లు డి.సత్యనారాయణ, ఎన్వీకె.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.బలరాంకు సంఘం చీఫ్ లైసన్ ఆఫీసర్ కృష్ణయ్య, అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పంతుల, వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ శుభాకాంక్షలు తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక

- అయ్యప్పస్వాములకు భిక్ష పెట్టిన ముస్లిం


భోజనం వడ్డిస్తున్న మహ్మద్ నిజామొద్దీన్

జన్నారం: మండల కేంద్రంలోని అయ్యప్ప భక్తులకు ముస్లిం సోదరుడు భిక్ష అందించి మతసామరస్యాన్ని చాటుకున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి మహ్మద్ నిజామొద్దీన్, మహిళా నాయకురాలు గీత ఆధ్వర్యంలో రాంపూర్, తాళ్ళపేట, మామిడిపల్లి, దండేపల్లి గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప నామస్మరణతో వీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు గడ్డం శ్రీనివాస్, త్రిమూర్తి స్వాములు పాల్గొన్నారు.

'ఉద్యమకారులను విస్మరించిన బీఆర్ఎస్'


దరఖాస్తు అందిస్తున్న కో ఆర్డినేటర్ రవీందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ దుర్గం రవీందర్ అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రెబ్బెన మండలం గోలేటి పంచాయతీలో గురువారం సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు అందించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్న యువకులు, విద్యార్థులపై అప్పటి పాలకులు అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపించారన్నారు. ఎంతో మంది యువకుల జీవితాలు నాశనం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ఉద్యమకారుల అంశాన్ని చేర్చడాన్ని ఉద్యమకారుల ఫోరం స్వాగతిస్తోందని పేర్కొన్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ


రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతు సతీష్

చెన్నూర్‌రూరల్: నాబార్డు ఆర్థిక సహాయంతో వాతావరణ నిర్ధారణ పథకంలో భాగంగా కుమురంభీం జిల్లా రింగన్‌గూడ గ్రామానికి చెందిన రైతులు చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు గోనే సతీష్ ఆ రైతులకు శిక్షణ ఇచ్చారు. కంపోస్టు ఎరువుల తయారీ, ద్రవ, ఘన జీవామృతాల తయారీపై తెలియజేశారు. తాను సేంద్రీయ ఎరువులతో సాగు చేస్తున్న పంటలపై వివరించారు. పంటలకు సేంద్రీయ ఎరువులను ఏ మోతాదులో ఏ పంటకు వాడాలో తెలియజేశారు. అనంతరం శిక్షణ పత్రాలను రైతులకు అందజేశారు.

తక్కువ ధరకే నాణ్యమైన సన్నబియ్యం

- ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా విక్రయం


జిల్లా కేంద్రంలోని గోదావరి ఎఫ్‌పీవో రైస్ స్టోర్

పాతమంచిర్యాల: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘం, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా మార్కెట్ కంటే తక్కువ ధరలకే కల్తీలేని సన్నబియ్యం విక్రయ కేంద్రాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన జైశ్రీరాం రకం వరి ధాన్యం మిల్లింగ్ చేసి క్వింటాల్‌కు రూ.5,800కు విక్రయిస్తున్నారు. జిల్లాలోని జైపూర్, భీమారం మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు 2018–19లో మహిళా ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటు చేసుకున్నారు. సంఘం ద్వారా రైతులకు ఎరువులు విక్రయిస్తున్నారు. పంటల సీజన్‌లో రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్‌లో వెయ్యి క్వింటాళ్ల బియ్యం విక్రయించాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో గోదావరి ఎఫ్‌పీవో రైస్ స్టోర్స్ పేరుతో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా డిసెంబర్ 30న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ ప్రారంభించారు.